క్లుప్తంగా

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: వర్షాకాలంలో దోమలు కుట్టకుండా, పుట్టకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవాలని ఏలూరు మలేరియా విభాగపు అధికారి జె.గోవిందరావు అన్నారు. శుక్రవారం ఏలూరు రూరల్ మండలం కోటేశ్వర దుర్గాపురం గ్రామంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమ తెరలు వాడాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో చాటపర్రు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీ రామాంజనేయులు, సూపర్‌వైజర్ ఇ.కిరణ్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ జాహ్నవి, ఏఎన్‌ఎం పావని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం ప్రార్థనలు



గొలుసుల పంజాలో పీర్ల వద్ద ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మొహర్రం నెల ప్రారంభం సందర్భంగా స్థానిక హజరత్ మౌలా అలీ ముష్కిల్ కుష (గొలుసుల పంజా) ఆస్థానలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం ఆస్థానలో పీర్లకు పూలతో అలంకరించి ఖుర్‌ఆన్ గ్రంథ పఠనం చేశారు. అనంతరం దరూద్ సలాం, ఫాతెహా ఖానీ నిర్వహించారు. నగరానికి చెందిన ముస్లింలతో పాటు హిందువులు సైతం ఆస్థానానికి విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసమారాధనలో సుమారు 600 మంది పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో గొలుసుల పంజా వంశపారం పర్య ముజావర్లు ఎండీ గాలబ్ అలీ, ఎండీ వజీర్ అలీ, ఎండీ మౌలా అలీ, ఎండీ ఖాదర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో సుమారు 50 ఏళ్ల వయసు గల మహిళ ఒంటరిగా తిరుగుతుంది. గుర్తు తెలియని ఈ మహిళ ఈనెల 25న అస్వస్థతకు గురవడంతో సిబ్బంది జీజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్యస్థితి విషమించటంతో శుక్రవారం రాత్రి మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించిన వైద్య సిబ్బంది జీజీహెచ్ ప్రాంగణంలోని ఔట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు.

రోడ్ల మరమ్మతుల్లో నాణ్యత డొల్లే!

- మూడు నెలలకే గోతులు పునర్దర్శనం
- ప్రజా ధనం రాళ్లపాలు
- విస్తుపోతున్న ప్రజలు



ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి శ్రీనివాస థియేటర్‌కు వెళ్లే మార్గంలో ఏర్పడిన గోతులు



ఓవర్ బ్రిడ్జి డౌన్‌లో ఫ్రూట్స్ షాపుల ఎదుట ఏర్పడిన పెద్ద గొయ్యి

ఏలూరు (టూటౌన్): చేసేది గోరంత.. ప్రచారం కొండంత అనే చందంగా తయారైందని చెప్పడానికి ఏలూరు నగరంలో మూడు నెలల కిందట రోడ్లకు చేపట్టిన మరమ్మతులే నిదర్శనం. హడావుడిగా చేసిన ఈ పనుల్లో నాణ్యత లోపించడంతో రోడ్లపై గోతులు తిరిగి దర్శనమిస్తున్నాయి. జూట్ మిల్లు సెంటర్ నుంచి కైకలూరు రోడ్డులో, వంగాయగూడెం సెంటర్ నుంచి కొత్తూరు రోడ్డులో, ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి శ్రీనివాస థియేటర్ రోడ్డు వరకు గోతులను మూడు నెలల క్రితం కంకర, తారుతో పూడ్చారు. సమస్య తీరిందని అనుకునేలోపే గోతులు ప్రత్యక్షమవటంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్భాటపు ప్రచారం, సొమ్ములు దండుకోవడం తప్ప తమకు ఒరిగిందేమీ లేదని విమర్శిస్తున్నారు.

ఏడాది పాలన ఆర్భాటమే

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తి కావడంతో ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు సమావేశాలు పెట్టి గొప్పలు చెప్పుకున్నారు. ఇందుకు ఏలూరు నగరంలోని రోడ్లే నిదర్శమని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గోతులు పూడ్చిన కొద్ది రోజులకే మళ్లీ గోతులు దర్శన మిస్తుండటంతో ఇదేనా నాణ్యత అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

మరమ్మతులకు రూ.1.25 కోట్లు

ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం రూ.1.25 కోట్ల అంచనాలతో 600 రోడ్లపై ప్యాచ్ వర్కులు చేపట్టినట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారు. వీటికి ఆర్‌అండ్‌బీ రహదారుల్లో చేపట్టిన పనులు అదనంగా ఉన్నాయి. ప్రధాన రహదారులు, నిత్యం జనంతో రద్దీ ఎక్కువగా ఉండే రోడ్లలో మరమ్మతులు చేశారు. ఇది చూసిన జనం ఆనంద పడ్డారు. ప్రమాదాల నుంచి బయట పడొచ్చని అనుకున్నారు. కానీ మూడు నెలలు తిరక్కుండానే పూడ్చిన చోట్ల తిరిగి గోతులు ప్రత్యక్షం కావడంతో ప్రజల ఆశ మూడు నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది.

తూతూ మంత్రంగా పనులు

ఏలూరు – కైకలూరు రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గంలో గతంలో రోడ్డును పూర్తిగా బాగుచేశామని చెప్పారు. అయితే ఈ మార్గంలో పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. వంగాయగూడెం సెంటర్ నుంచి ఇటు కైకలూరు వైపు, అటు కొత్తూరు వైపు వెళ్లే మార్గంలోనూ రోడ్లపై పూడ్చిన గోతులు తిరిగి కంకర పైకి లేచి యథావిధిగా గోతులతో దర్శనమిస్తున్నాయి. ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు ఉన్న రోడ్డులో సైతం గోతులను పెద్ద ఎత్తున పూడ్చారు. వీటి పరిస్థితి డొల్లగానే తయారైంది.

నాణ్యతను ప్రశ్నిస్తున్న గోతులు



ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు ఉన్న మార్గంలో గతంలో పూడ్చిన గోతులు తిరిగి ప్రత్యక్షమయ్యాయి. గోతుల్లో వేసిన కంకర, తారు కొద్దిపాటి వర్షానికే కొట్టుకు పోయి నాణ్యతను ప్రశ్నిస్తున్నాయి. మూడు నెలలు తిరక్కుండానే పలు చోట్ల గోతులు యథావిధిగా దర్శనమిస్తున్నాయి. వాహనాలు వేగంగా వస్తూ గోతులు దగ్గరకు వచ్చే సరికి సడెన్ బ్రేక్‌లు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు, ఏలూరు

అధ్వానంగా రోడ్లు



ఏలూరులో ఇటీవల రోడ్లపై పూడ్చిన గోతులు తిరిగి ప్రత్యక్షమయ్యాయి. మూడు నెలలు తిరక్కుండానే కంకర పైకి లేచిన గోతులు గతం కన్నా మరింత పెద్దవయ్యాయి. దీంతో ఆటోలకు, ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రమాదాలకు లోనవుతున్నారు. ప్రచార ఆర్భాటం మినహా పనుల్లో ఎక్కడా నాణ్యత కనబడటం లేదు. మొక్కుబడిగా కాకుండా పూర్తి నాణ్యతతో పనులు చేపట్టేలా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– జె.గోపి, సీఐటీయూ నాయకుడు, ఏలూరు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ సైమన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై శుక్రవారం స్థానిక ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య (ఏఆర్‌డీజీకే) మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైమన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల శారీరకంగా, ఆర్థికంగా, కుటుంబ పరంగా ఏర్పడే ఇబ్బందులను వివరించారు. యుక్త వయసు పిల్లలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఉన్నత చదువులు చదివి మంచి హోదాలో జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉన్నమట్ల కాంతి జయ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వేగవంతంగా రీసర్వే

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి, కోమటిలంక గ్రామాల్లో రీ సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.విజయ్ కుమార్ రాజు తెలిపారు. శుక్రవారం రీసర్వే డీటీ నాగమణితో కలిసి ఆయన పనులను పర్యవేక్షించారు. సర్వేయర్లు, వీఆర్‌ఓలకు పలు సూచనలు చేశారు. ఆర్‌డీఓ కార్యాలయంలో వెరిఫికేషన్ పనులు సైతం వేగవంతంగా చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

దివ్యాంగులకు చేయూత ఇవ్వాలి



హెలెన్ కెల్లర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): దివ్యాంగులకు సమాజంలో ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి రామ్ కుమార్ పిలుపు నిచ్చారు. స్థానిక దొండపాడులోని పరివర్తన్ బధిరుల పాఠశాల, జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సంయుక్తంగా శుక్రవారం హెలెన్ కెల్లర్ డే (జూన్27)ని ఘనంగా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఏడీ రామ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి అందరూ కలిసి రావాలన్నారు. హెలెన్ కెల్లర్ జీవితం, ఆమె సాధించిన విజయాలు, దివ్యాంగుల హక్కుల కోసం ఆమె చేసిన కృషిని వివరించారు. పరివర్తన్ బధిరుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల దివ్యాంగ పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని స్వావలంబన దిశగా ప్రోత్సహిస్తోందని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫాసిస్టు విధానాలపై పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఏలూరు (టూటౌన్): నాటి ఎమర్జెన్సీ కంటే నేటి అప్రకటిత ఎమర్జెన్సీ మరింత ప్రమాదకరమైందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు యు.వెంకటేశ్వరరావు (యూ.వీ) పిలుపునిచ్చారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం పార్టీ స్థానిక కార్యాలయంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. నాడు ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ 19 నెలల పాటు కొనసాగిందని గుర్తుచేశారు. ఆ కాలాన్ని చీకటి రోజులుగా ప్రకటించారని తెలిపారు. నేటి బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాలకులు అత్యవసర పరిస్థితి ప్రకటించకుండానే నాటి ఎమర్జెన్సీ కంటే దారుణమైన పరిస్థితులు తీసుకొచ్చారని చెప్పారు. మనువాద, ఫాసిస్టు పాలనలో దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలపై దాడులు, హత్యాకాండలు పరంపరగా కొనసాగుతోందని, గొంతెత్తి నిలదీసిన వారిని అర్బన్ నక్సలైట్లు పేరిట నిర్బంధానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. పార్టీ నగర కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. సమావేశానికి గడసాల రాంబాబు అధ్యక్షత వహించగా, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.నాని, ఇఫ్టూ నాయకులు మంగం అప్పారావు, ఎం రాము, రమణ, ప్రసాద్, సూరిబాబు, విజయ్, అన్నవరం, తిరుపతిరావు, కోరాడ అప్పారావు, రమణ, పల్లి గంగరాజు, ప్రసాదు, సంధకం అప్పారావు, గునుపూడి నాగేశ్వరరావు, పి.విష్ణు, శ్రీను, భాస్కర్ రావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం అధ్యక్షుడిగా రాంబాబు

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ చేనేత విభాగం ఏలూరు నియోజకవర్గం అధ్యక్షుడిగా యర్రా రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై ముద్రించిన పోస్టర్‌ను చూపుతున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా సైబర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దాసు అన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా సైబర్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సైబర్ సెల్ మహిళా ఎస్సై వల్లి పద్మ సీఆర్‌రెడ్డి కాలేజ్ ప్రాంగణంలో ఎన్‌సీసీ విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ సైబర్ నేరాల ప్రభావం, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా ప్రమాదాలు నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ వేధింపులకు గురైతే తక్షణమే పోలీసు సహాయం పొందాలని, ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసే ప్రతి సమాచారం శాశ్వతంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. సైబర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930కి ఫోన్ చేసి సమాచారం అందిస్తే పోలీసులు సహాయ సహకారాలను అందిస్తారని మహిళా ఎస్సై పద్మ తెలిపారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



కమిషనర్ భానుప్రతాప్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

ఏలూరు (టూటౌన్): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, రోజుకు 10 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు కూడా పాల్గొంటున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నగర కమిటీ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కి సమ్మె నోటీసు అందజేసింది. మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్సీ ప్రకటించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరింది. జూలై 9న సమ్మెలో ఏలూరు నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికులు దాదాపు 1000 మంది పాల్గొంటున్నారని పేర్కొంది. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, అధ్యక్షులు లావేటి కృష్ణారావు, కార్యదర్శి అంగుళూరు జానుబాబు, ఉపాధ్యక్షులు బంగారు వెంకటేశ్వరరావు, ఆంథోని పాల్, ప్రసాదు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	28	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	34	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	36
బెండకాయలు	38	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	48-56	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	45	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	34	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

రజకులకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజకుల వృత్తి నిర్వాహణకు సంబంధించి ఉచిత విద్యుత్ తదితర అంశాలతో ప్రభుత్వం జీఓలు విడుదల చేసినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అమలు కావడంలేదని రజక జన సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక ఏటిగట్టులోని జిల్లా రజ క జనసంఘ కార్యాలయంలో రజక సంఘ నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ జీఓ 75ను అనుసరించి రజకుల వృత్తి చెరువుల మోటార్లకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని డిమాండ్ చేశా రు. ఉమ్మడి జిల్లాలోని 909 గ్రామాల్లో కొన్ని చోట్ల మాత్రమే గ్రామ పంచాయతీలు మంచినీటి కనెక్షన్ ద్వారా చెరువులకు నీరు అందిస్తున్నారని చెప్పారు. ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో సు మారు 75 కుటుంబాల రజకులు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి ఉచిత విద్యుత్ వర్తింపజేయాలని కోరారు. అనంతరం రజక జన సంఘ చేబ్రోలు గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నా రు. అధ్యక్షుడిగా చీపురుపల్లి అప్పారావు, ఉపాధ్యక్షుడిగా మాన్రాజు రమణ, సెక్రటరీగా యండమూ రి శ్రీనివాసులు, కోశాధికారిగా ఉద్దాల శ్రీనివాసు, మరో ముగ్గురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నా రు. కార్యక్రమంలో జిల్లా రజక నేతలు వట్లూరు మురళి, వి.శ్రీనివాస్, కడెల్లి సుబ్బయ్య, లక్ష్మీ ప్రసన్న, ఎలమంచిలి నాగ శేషు పాల్గొన్నారు.

రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (టూటౌన్): యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రిటైల్ సేల్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వి.వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఏలూరులో నిర్వహించే శిక్షణకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, 18 సంవత్సరాలు నిండినవారు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 88868 82032లో సంప్రదించవచ్చన్నని తెలిపారు.

చిత్తడి రోడ్లు.. రాకపోకలకు పాట్లు



49వ డివిజన్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



కబాడీ గూడెం ప్రాంతంలోని బురద రోడ్డు

ఏలూరు (టూటౌన్): కొద్దిపాటి వర్షానికే నగరంలోని రోడ్లన్నీ ఛిద్రంగా మారుతున్నాయి. వర్షం నీరు రోడ్లపై నిలిచిపోవడంతో పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిలిచిన వర్షం నీరు డ్రెయిన్లలోకి వెళ్లే మార్గం లేక నీటిలోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. స్థానిక 49వ డివిజన్ ప్రాంతంలోని సచివాలయం-2 పరిధిలోని కబాడీగూడెం ప్రాంతంలో రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నిత్యం 10 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో అత్యధికులు పాఠశాల, కాలేజీ విద్యార్థులే. రెండు రోజులుగా కురిసిన కొద్ది పాటి వర్షానికే ఈ ప్రాంతంలో రోడ్లన్నీ ఛిద్రమయ్యాయి. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు సమస్యను పరిష్కారించాలని వారు ముక్త కంఠంతో కోరుతున్నారు.

ప్రతిభ చూపిన వారికే సీటు

బుట్టాయగూడెం: సూపర్ 50 ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సీటు కేటాయిస్తామని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ తెలిపారు. ఐటీడీఏ పరిధిలో 10వ తరగతి చదువుతున్న బాల బాలికలకు సూపర్ 50 ప్రత్యేక శిక్షణకు సంబంధించి ఐటీడీఏ పీఎంఆర్‌సీ వద్ద నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ ఎంట్రన్స్‌కు సంబంధించి ప్రత్యేక క్లాసులు జూలై 1వ తేదీ నుంచి రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తామని పీఓ తెలిపారు. మండలంలోని కామయ్యకుంట బాలికల ఆశ్రమ పాఠశాల, నూతిరామన్నపాలెం బాలుర సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఈ క్లాసులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో స్టేట్ అకడమిక్ మోనిటరింగ్ రాష్ట్ర పరిశీలకులు సాయికిశోర్, పీఎమ్ఆర్‌సీ అధికారి కొవ్వాసి శిరమయ్యలు, డీడీ శ్రీవిద్య, సీఎంఓ శ్రీనివాసరావు, జీసీడీఓ బి.రాజేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల నిరసన



కొత్తూరులో నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

వేలేరుపాడు: ఉపాధి హామీ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కూలీలు డిమాండ్ చేశారు. వేలేరుపాడు మండలం కొత్తూరు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో కూలీలు శుక్రవారం రోడ్డుపై బైఠాయించారు. సీపీఎం నాయకులు ధర్మల రమేష్, మడివి దుర్గారావు మాట్లాడుతూ సుమారు 9 వారాలుగా కూలీలకు వేతనాలు అందడం లేదన్నారు. కేంద్రం నిధులు విడుదల చేసినప్పటికీ, కూలీల ఖాతాల్లో డబ్బులు జమచేయలేదని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.